క్లుప్తంగా

అంతర్జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం


ధర్మారావు, తెలుగు ఉపాధ్యాయుడు


పిల్లా వెంకట రమణమూర్తి

సీతంపేట: తానా అంతర్జాతీయ కవి సమ్మేళనానికి అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఎం.వి.ధర్మారావు, బీవీకే కళాశాలకు చెందిన రిటైర్డ్ సంస్కృత అధ్యాపకుడు పిల్లా వెంకట రమణమూర్తిలకు ఆహ్వానం అందింది. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక సంయుక్తంగా ఈ నెల 9న నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆన్‌లైన్ కవి సమ్మేళనంలో వీరు పాల్గొంటారు. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో స్థానం కల్పించినందుకు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్‌లకు ధర్మారావు, రమణమూర్తిలు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ సరకుల పంపిణీ


రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్క వీధిలో బుధవారం రేషన్ సరకులు పంపిణీ చేశారు. రేషన్ వాహనం ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు అందజేశారు. కార్డుదారులు క్యూలో ఉండి సరకులు తీసుకున్నారు.

భర్తపై ఫిర్యాదు

మద్దిపాలెం: భర్త తనను వేధిస్తున్నాడంటూ ఓ భార్య కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల తెలిపిన వివరాలిలా.. లంకా వసంత అనే మహిళకు ఆరేళ్ల కిందట వినయ్‌కుమార్‌తో వివాహం జరిగింది. వీరిద్దరూ కంచరపాలెంలో నివసించేవారు. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. గత నాలుగేళ్లుగా భర్త వినయ్‌కుమార్ వివాహేతర సంబంధాలు పెట్టుకుని తనను వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. అవి తట్టుకోలేక ఆమె ప్రస్తుతం ఐటీఐ జంక్షన్ వద్ద ఓ ఇంట్లో కుమార్తెతో కలిసి నివసిస్తోంది. భర్త వేధింపులపై బుధవారం కంచరపాలెం పోలీసులకు వసంత ఫిర్యాదు చేయగా.. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు సహకరిస్తాం

అల్లిపురం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన టీచర్స్ డే వేడుకల్లో పాల్గొన్న ఆమె ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఇబ్బందికరంగా పార్కింగ్


గణేష్‌నగర్‌లో రోడ్డుకు ఇరువైపులా నిలిపిన ద్విచక్ర వాహనాలు

సీతమ్మధార: రహదారికి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు నిలిపివేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. 14వ వార్డులోని గణేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. రోడ్ల వెంబడి పలు ప్రైవేట్ సంస్థల వాహనాలతోపాటు కార్లను పార్క్‌చేసి వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అద్దంలా రహదారులు

- కళకళలాడుతున్న 51వ వార్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యంగా కళింగనగర్ ప్రాంతం అనేక అభివృద్ధి పనులతో కళకళలాడుతోంది. ఇక్కడ నిర్మించిన బీటీ రోడ్లు అద్దంలా మెరిసిపోతున్నాయి. రూ.15 కోట్ల నిధులతో వార్డును అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో చాలా వరకు పనులు పూర్తికాగా.. కొన్ని జరుగుతున్నాయి, మరికొన్ని మొదలవ్వాల్సి ఉంది. కార్పొరేటర్‌గా రెయ్యి వెంకటరమణ ఎన్నికైన నాటి నుంచి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చి ప్రజల మన్ననలు పొందుతూ వార్డును అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రజలతో మమేకమవుతున్న తీరు, ఆయన సహాయ సహకారాలు, చొరవతో వార్డు అభివృద్ధి మరింత వేగంగా జరుగుతోంది.

కళింగనగర్‌కు మహర్దశ

వార్డులోని కళింగనగర్‌లో 30 ఏళ్లుగా రోడ్లు లేకపోవడం స్థానికులకు తీరని సమస్యగా మిగిలింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేయడంతో జీవీఎంసీ వార్డులకు మహర్దశ పట్టింది. ఎన్నడూ లేని విధంగా కళింగనగర్ ప్రాంతం రోడ్లు, కాలువలు, కల్వర్టు, డ్రైనేజీల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటుతో బాగుపడింది. కళింగనగర్‌లోని పలు ప్రాంతాల్లో రూ.60 లక్షలతో బీటీ రోడ్లు నిర్మించారు. ఎంఎన్ఆర్ పార్కు, మాధవ స్వామి కల్యాణ మండపం చుట్టూ, విద్యానగర్ స్ట్రీట్, కళింగనగర్ గాయత్రి అమ్మవారి గుడి రోడ్డు, 48 లాస్ట్ బస్‌స్టాప్ మాధవధార వుడా కాలనీల్లో నూతన రహదారులతోపాటు కళింగనగర్‌లోని పలు ప్రాంతాల్లో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్లు, కల్వర్టులు నిర్మించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


మాధవధార వుడా కాలనీ 48 లాస్ట్ బస్‌స్టాప్ ప్రాంతంలో నిర్మించిన రోడ్డు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు రూ.20 లక్షలతో కళింగనగర్ వుడా క్వార్టర్స్ ప్రాంతంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. మాధవధార 48 లాస్ట్ బస్‌స్టాప్ లైన్ వుడా కాలనీ రోడ్డు పనులు ఇటీవల పూర్తి చేశారు. మాధవధార ప్రాంతంలోని రోడ్లన్నీ అనుసంధానంగా ఉంటాయి. వాకింగ్‌కు వీలుగా ఎటునుంచి ఎటు వెళ్లడానికైనా ఇబ్బంది ఉండదు. గతంలో రోడ్డు బాగులేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు కొత్త రోడ్డు నిర్మాణంతో హాయిగా వాకింగ్ కూడా చేస్తున్నారు.


కళింగనగర్ ఎంఎన్ఆర్ పార్కు వద్ద పూర్తయిన బీటీ రోడ్డు

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమైంది



30 ఏళ్లుగా కళింగనగర్‌లో నివసిస్తున్నాం. రోడ్లు బాగుండేవి కాదు. వీధిలైట్లు లేవు. కాలువల పరిస్థితి ఘోరం. ఇలా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రతి విషయాన్ని అడిగి తెలుసుకుని సమస్యలను పరిష్కరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతోంది. మళ్లీ వైఎస్ జగనే ముఖ్యమంత్రి అవుతారు.

– అచ్చియమ్మ, కళింగనగర్

వార్డు అభివృద్ధే ధ్యేయం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రతి వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చొరవతో వార్డు శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కళింగనగర్‌ను మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల పనులు పూర్తిచేశాం.

– రెయ్యి వెంకటరమణ, కార్పొరేటర్, 51వ వార్డు

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

సీతంపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. కృష్ణ మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సీతంపేట హిందూ ముస్లిం కాలనీలో శ్రీవంశీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి సంబరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన యువత, ఆర్.ఆర్.బాయ్స్ ఉట్టి కొట్టడానికి ఉత్సాహంగా పోటీపడ్డారు. ఉట్టి కొట్టలేని వారిపై నీళ్లు పోసి కేరింతలు కొట్టారు. ముందుగా శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు చేశారు.


హిందూ ముస్లిం కాలనీలో ఉట్టి సంబరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

- సీతంపేటలోని రాధాకృష్ణ ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు సందడిగా జరిగాయి. సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను అలరించాయి.

వైభవుడి ఆలయంలో వేడుకలు నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆలయంలో పూజల అనంతరం సాయంత్రం 5 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మాధవ స్వామి మహిళా కోలాట బృందం చిన్నారులు కోలాటం ప్రదర్శిస్తారని చెప్పారు. 6 గంటలకు అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 7 గంటలకు ఉట్టు కొట్టు సంబరం జరుగుతుందని, భక్తులందరూ పాల్గొనాలని ఈవో కోరారు.

రేపు ఉచిత సామూహిక శ్రావణలక్ష్మీ పూజలు

డాబాగార్డెన్స్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు అమ్మవారి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు పూరించి గురువారంలోగా అందజేయాలి.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీ దళార్చన నిర్వహించనున్నారు. రూ.1,500 పూజా రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

21వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు..

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు బుధవారం నాటికి 21వ రోజుకు చేరాయి. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సిరులతల్లికి భక్తులు విశేష అభిషేకాలు చేశారు. ఈ పూజల్లో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


సిరులతల్లికి అభిషేకం చేస్తున్న భక్తులు

వీనులవిందుగా గాత్ర కచేరీ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటకోత్సవాల 5వ రోజు శారదా సుబ్రహ్మణ్యం గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, శారదా సుబ్రహ్మణ్యం గుమ్ములూరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేశారు. వయొలిన్‌పై మావుడూరి శర్మ, మృదంగంపై జయ భాస్కర్, ఘటంపై ఎం.సూర్యప్రసాద్ సహకారం అందించారు.


కచేరీ నిర్వహిస్తున్న శారదా సుబ్రహ్మణ్యం

గణేష్ ఉత్సవాలకు ముహూర్తపు రాట


వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో ఉత్సవ రాట వద్ద పూజలు చేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు, విజయగణపతి ఉత్సవ కమిటీ సభ్యులు

సీతమ్మధార: గణేష్ ఉత్సవాలకు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో బుధవారం విజయగణపతి నవరాత్రి మహోత్సవానికి సంబంధించి అర్చక బృందం వేదమంత్రాల నడుమ పందిరి రాట వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఈ నెల 18న వినాయక చవితి సందర్భంగా గణపతిని ప్రతిష్ఠిస్తున్నట్లు తెలిపారు. 9 రోజుల పాటు పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, ఉత్సవ కమిటీ సభ్యుడు కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సారిపల్లి గోవింద్, సాడి పద్మారెడ్డి, బర్కత్ అలీ, రెయ్యి వెంకటరమణ, కె.వి.ఎస్.శశికళ, చల్లా రజని, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, ఉత్సవ కమిటీ సభ్యులు కె.అనిల్‌కుమార్‌రాజు(14వ వార్డు కార్పొరేటర్), కిరణ్ రాజ్, అంబటి శైలేష్, నీలి రవి, ఆళ్ల శివగణేష్, రాజాన రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీదుర్గా దంతేశ్వరి యూత్ ఆధ్వర్యంలో..

సీతంపేట: శ్రీదుర్గా దంతేశ్వరి యూత్ ఆధ్వర్యంలో వినాయక ద్వాదశరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సీతంపేట గొల్లవీధి సాయిబాబా ఆలయం వద్ద బుధవారం ముఖ్య అతిథి సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, ముత్తయిదువలు, నిర్వాహకులతో కలిసి పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నాలు తొలగించే వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే శుభ ఫలితాలు కలుగుతాయన్నారు. ఏడేళ్లుగా దంతేశ్వరి యూత్ చవితి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు, పదడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 11 రోజుల పాటు పూజలు చేసి భారీ ఊరేగింపు నిర్వహిస్తామని యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నమ్మి వెంకట్, దంతేశ్వరి యూత్ కోడిబోయిన సాయి, కోడిబోయిన దంతేష్, వియ్యపు ఆదిత్య, పల్లా రోహిత్, చందు, పండు, గౌతం, యశ్వంత్, సుమంత్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.


రాట వేస్తున్న సంపంగి శ్రీనివాసరావు, శ్రీదుర్గా దంతేశ్వరి యూత్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అల్లిపురంలో నివసిస్తున్న పులి వెంకటరెడ్డి అనే వ్యక్తి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అల్లిపురంలోని తన ఇంటి నుంచి బైక్ మీద మురళీనగర్‌కు ఓ పని నిమిత్తం బయలుదేరి వెళ్లాడు. తాటిచెట్లపాలెం హైవే దరి ధర్మానగర్ దగ్గరకు వచ్చేసరికి అదే దారిలో సర్వీస్ రోడ్డు నుంచి ఓ కారు హైవే వైపు వెళ్తూ ఇతడిని ఢీకొంది. దీంతో సదరు వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తలకు ఎడమవైపు గాయాలయ్యాయని వెంకటరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

జనం కోసం

అందుబాటులో అధికారులు

కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 అధికారులు సమాచార హక్కు చట్టం–2005 ప్రకారం పౌర సమాచార అధికారులుగా సేవలందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. జోన్ పరిధి 40 నుంచి నుంచి 63వ వార్డు వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అధికారుల ఫోన్ నంబర్లకు కాల్‌చేసి తెలియజేయవచ్చు. అవసరమైన పౌర సమాచారం అడిగి తెలుసుకోవచ్చు. జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు అర్జీలు సమర్పించవచ్చు.


జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయం

జీవీఎంసీ జోన్–5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్–1 పీఐవో(రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్–2 పీఐవో(టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్–ఏ డీమ్డ్ పీఐవో(ఇంజినీరింగ్ విభాగం)	99480 78507
టి.ప్రసన్నరెడ్డి	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్–బీ డీమ్డ్ పీఐవీ(ఇంజినీరింగ్ విభాగం)	79979 54406
ఆర్.బాబూరావు	రెవెన్యూ కమిషనర్ డీమ్డ్ పీఐవో	88972 10764
రఘునాథ్	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో(టౌన్ ప్లానింగ్)	81878 99199
ఎం.శ్రీలక్ష్మి	టౌన్ ప్లానింగ్ అధికారి	70932 87310
డాక్టర్ సునీల్‌కుమార్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	98485 02578
సూరిశెట్టి శేఖర్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్–బీ డీమ్డ్ పీఐవో(వాటర్ వర్క్స్ విభాగం)	99480 78503
శ్రీనివాస్ వర్మ	డిప్యూటీ ఇంజినీర్ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్ విభాగం)	99123 49448
ఎస్.జనార్దనరావు	శానిటరీ సూపర్‌వైజర్	70363 96919

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి..!

జీవీఎంసీ జోన్–5 పరిధిలో ప్రజా ఆరోగ్యం, పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చు. 42 నుంచి 51, 53, 54, 55 వార్డుల వరకు గల 13 వార్డులకు సంబంధించిన పారిశుధ్య సమస్యలు, చెత్త తొలగించపోయినా, గెడ్డలు, కాలువల్లో పూడికలు తీయకపోయినా, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ కాల్ చేసి సమాచారం అందించాలని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. వారు పట్టించుకోని పక్షంలో ప్రతి సోమవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జెడ్సీ సమక్షంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో నేరుగా ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.


కాలువ శుభ్రతను పరిశీలిస్తున్న జోన్–5 కమిషనర్ కృష్ణ(ఫైల్)

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్ల సమాచారం

వార్డు	అధికారి	బాధ్యత	ఫోన్ నంబర్
41	ఎం.ప్రసాద్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83942
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	77299 95924
43	అప్పారావు	ఔట్ సోర్సింగ్ ఇన్‌చార్జి	99665 91821
44	ఎన్.సూరిబాబు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83938
45	కె.పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83932
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	80085 36403
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
48	డి.అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	90103 93037
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
50	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్	94941 83244
51	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్ ఇన్‌చార్జి	94941 83244
54	వై.త్రిమూర్తులు	పిహెచ్ మేస్త్రీ	99488 83947
55	ఉప్పిలి కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

ఫిషింగ్ హార్బర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో ఉదయం వేళల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ కొనసాగుతోంది. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు చేపల వేలం పాట వద్ద రద్దీ వల్ల గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీని వల్ల మత్స్యకారులతో పాటు బోటు యాజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర మర పడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ స్పందన ద్వారా ఇటీవల కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ట్రాఫిక్ పోలీసులు హార్బర్‌లో పలు ప్రాంతాలను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. చేపల వేలం కేంద్రం వద్ద ఎక్కువగా ఆటోలు నిలుపుదల చేయటం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశాఖపట్నం ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ సమన్వయంతో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ రాజీవ్ కుమార్ హామీ ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ తెలిపారు.

వెండి కిరీటాలు, ఆభరణాల బహూకరణ

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పాపయ్యరాజుపాలెం ఆర్టీసీ లేఅవుట్‌లోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దాతలు సమకూర్చిన వెండి కిరీటాలు, ఆభరణాలను బుధవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతులమీదుగా అందజేశారు. పాపయ్యరాజుపాలేనికి చెందిన దాతలు జి.సంగమేశ్వరరావు, రామారావు, దూర్వాసులు, రవిప్రసాద్, కృష్ణారావు, శేఖర్, నాగమణి, మోహనరావు, రామప్రసాద్ రూ. లక్షతో స్వామికి వెండి కిరీటాలు, ఆభరణాలు చేయించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు వాటిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, కె.సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు కేవీఆర్.లక్ష్మి, భీమారావు, రామసూరి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఊటగెడ్డ పార్కు ప్రారంభం

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని ఊటగెడ్డ పార్కును బుధవారం మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.3.45 కోట్లతో పార్కును అభివృద్ధి చేశామన్నారు. నగరానికి సువిశాలమైన తీర ప్రాంతం ఉందని, పర్యాటకులందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్ అనేక పార్కులను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కార్యనిర్వహక ఇంజినీర్ సుధాకర్, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ

బీచ్‌రోడ్డు: అతి వేగంగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మంగళవారం అర్ధరాత్రి మద్దిలపాలెం నుంచి ఎన్ఏడీ వెళ్తున్న కారు.. సీతమ్మధార నుంచి రామాటాకీస్ వైపు వెళ్తున్న మరో కారు సత్యం జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కార్లు రెండు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన కారు

పోషకాహార వంటల పోటీలు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో బుధవారం పోషకాహార వంటల పోటీలు నిర్వహించారు. మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూట్రీషియన్ వారోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ పోటీల్లో పలువురు మహిళలు పాల్గొని వివిధ రకాల వంటలు తయారు చేసి ప్రదర్శించారు. బాలాజీ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) వైద్యురాలు డాక్టర్ కిరణ్ లలితాదేవి పాల్గొని వంటకాలు పరిశీలించారు. రుచికరంగా వంటలు చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తినడం వల్ల చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు సౌజన్య, శంకర్, సాయి, రేవతి, గౌతమి, స్వాతి, యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వంటలను పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్ లలిత